దావోస్‌లో జరుగుతున్న డబ్ల్యూఈఎఫ్ సదస్సులో పలువురు కంపెనీల ప్రతినిధులతో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

రాష్ట్రంలో 'యూనిలివర్' పెట్టుబడి

కామారెడ్డిలో పామాయిల్, సీసా మూతల యూనిట్ల ఏర్పాటు

ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్న సంస్థ

హైదరాబాద్, జనవరి 21 (నమస్తే తెలంగాణ): ప్రముఖ ఎఫ్ఎంసీజీ కంపెనీ 'యూనిలివర్' తెలంగాణలో పెట్టుబడి పెట్టేందుకు సంసిద్ధత వ్యక్తం చేసింది. కామారెడ్డిలో పామాయిల్ తయారీ, రిఫైనింగ్ యూనిట్‌తో పాటు బాటిల్ క్యాప్‌ల (సీసా మూతల) తయారీ యూనిట్‌ను నెలకొల్పేందుకు ముందుకొచ్చింది. ఈ మేరకు స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో ప్రపంచ వాణిజ్య వేదిక (డబ్ల్యూఈఎఫ్) సదస్సు సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందాన్ని కుదుర్చుకున్నది. వినియోగ వస్తువుల తయారీలో ప్రపంచ ప్రఖ్యాతి పేరొందిన 'యూనిలివర్' మన దేశంలో హిందుస్థాన్ యూనిలివర్ పేరుతో కార్యకలాపాలు సాగిస్తున్న విషయం తెలిసిందే. 'యూనిలివర్' గ్లోబల్ సీఈవో హీన్ షూమేకర్‌తోపాటు ఆ కంపెనీ చీఫ్ సప్లైచైన్ ఆఫీసర్ విల్లెం ఉయిజెన్‌తో సీఎం రేవంత్‌రెడ్డి జరిపిన చర్చల అనంతరం ఈ ఒప్పందం ఖరారైనట్టు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

స్కైరూట్ రూ.500 కోట్ల పెట్టుబడి

డబ్ల్యూఈఎఫ్ సదస్సులో పాల్గొంటున్న సీఎం రేవంత్‌రెడ్డి బృందం మంగళవారం తెలంగాణ పెవిలియన్‌లో వివిధ కంపెనీల ప్రతినిధులతో సమావేశమైంది. ఈ సందర్భంగా తెలంగాణలో ప్రైవేట్ రాకెట్ తయారీ, ఇంటిగ్రేషన్ అండ్ టెస్టింగ్ యూనిట్ ఏర్పాటుకు 'స్కైరూట్' కంపెనీ ముందుకొచ్చింది. రూ.500 కోట్ల పెట్టుబడితో ఈ యూనిట్‌ను నెలకొల్పేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్నది. సప్లయ్ చైన్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఇన్నోవేషన్ రంగాల్లో ఖ్యాతి పొందిన 'ఎజిలిటీ లాజిస్టిక్స్' కంపెనీ వైఎస్ చైర్మన్ తారెక్ సుల్తాన్‌తో రాష్ట్ర ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు భేటీ అయ్యారు.

మార్కెట్‌కు ట్రంప్ సెగ



ముంబై, జనవరి 21: దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం భారీ నష్టాలకు లోనయ్యాయి. ఉదయం ఆరంభంలో లాభాల్లో కదలాడినా.. ఆ తర్వాత నష్టాల్లోకి జారుకున్నాయి. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 1,235.08 పాయింట్లు లేదా 1.60 శాతం కోల్పోయి 75,838.36 వద్ద ముగిసింది. ఒకానొక దశలోనైతే 1,431.57 పాయింట్లు పడిపోయింది. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ కూడా 320.10 పాయింట్లు లేదా 1.37 శాతం దిగజారి 23,024.65 వద్ద స్థిరపడింది. గత ఏడాది జూన్ 6 తర్వాత ఈ స్థాయికి సూచీ రావడం ఇదే తొలిసారి. కాగా, ఇంట్రా-డేలో నైతే 367.90 పాయింట్లు పతనమైంది.

ఇదీ సంగతి..

అమెరికా కొత్త అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. మళ్లీ వాణిజ్య యుద్ధానికి తెరతీస్తారన్న అంచనాలు మార్కెట్ సెంటిమెంట్‌ను ఒక్కసారిగా దెబ్బతీశాయి. అగ్రరాజ్య రక్షణాత్మక ధోరణులతో ఇతర దేశాల ఆర్థికావకాశాలు క్షీణిస్తాయన్న భయాందోళనలు మదుపరుల్లోనూ చెలరేగాయి. ఫలితంగా స్టాక్ మార్కెట్లలో అలజడి చోటుచేసుకున్నది. నిజానికి ఎన్నికల ప్రచారంలోనే పొరుగు దేశాల నుంచి తమ దేశంలోకి దిగుమతయ్యే వస్తూత్పత్తులపై సుంకాలను 10 నుంచి 20 శాతం విధిస్తామని, చైనా నుంచి వస్తున్నవాటికైతే టారీఫ్‌లు 60 శాతంగా ఉంటాయని ట్రంప్ ప్రకటించిన విషయం తెలిసిందే. గతంలో అధ్యక్షుడిగా ఉన్నప్పుడూ ట్రంప్.. సుంకాల సమరానికి కాలు దువ్విన సంగతి విదితమే. ఈ క్రమంలో ఇప్పుడూ అదే సంకేతాలు వస్తున్నాయి. వచ్చే నెల మొదలు కెనడా, మెక్సికోల నుంచి జరిగే దిగుమతులపై దాదాపు 25 శాతం సుంకాలు విధించే యోచనలో ఉన్నామని ట్రంప్ సోమవారం ప్రకటించారు. ఆ రెండు దేశాల నుంచి అమెరికాలోకి పెద్ద ఎత్తున అక్రమ వలసలు జరుగుతున్నాయని, నార్కోటిక్స్ వస్తున్నాయని ట్రంప్ ఆరోపిస్తున్నారు. వీటిని అరికట్టేందుకే సుంకాలను పెంచాలని చూస్తున్నట్టు చెప్పారు. ముమ్ముందు ఇతర దేశాలపైనా ట్రంప్ ఇదే దుందుడుకు వైఖరి ఉంటుందన్న అంచనాలొస్తున్నాయి.

రంగాలవారీగా..

రియల్టీ రంగ షేర్లు గరిష్ఠంగా 4.22 శాతం నష్టపోయాయి. కన్స్యూమర్ డ్యూరబుల్స్ 3.99 శాతం, సర్వీసెస్ 2.86 శాతం, పవర్ 2.63 శాతం, టెలికం 2.52 శాతం చొప్పున తగ్గాయి. జొమాటో షేర్ విలువ అత్యధికంగా 10.92 శాతం పడిపోగా.. ఎన్టీపీసీ, అదానీ పోర్ట్స్, ఐసీఐసీఐ బ్యాంక్, ఎస్బీఐ, రిలయన్స్ ఇండస్ట్రీస్, మహీంద్రా అండ్ మహీంద్రా, బజాజ్ ఫైనాన్స్, టెక్ మహీంద్రా, యాక్సిస్ బ్యాంక్ షేర్లూ పతనమయ్యాయి. ఇక ఆసియా మార్కెట్లలో జపాన్, హాంకాంగ్ సూచీలు లాభపడగా.. చైనా, దక్షిణ కొరియా ఇండెక్స్‌లు నష్టపోయాయి. కాగా, విదేశీ సంస్థాగత మదుపరులు ఒక్కరోజే రూ.5,920 కోట్ల పెట్టుబడుల్ని వెనక్కి తీసుకున్నట్టు స్టాక్ ఎక్స్ఛేంజ్ గణాంకాలు చెప్తున్నాయి.

మార్కెట్ విలువ డౌన్

స్టాక్ మార్కెట్ల భారీ నష్టాలతో ఆయా కంపెనీల మార్కెట్ విలువ కూడా అదే రీతిలో క్షీణించింది. ఈ ఒక్కరోజే మదుపరుల సంపద రూ.7.52 లక్షల కోట్లు ఆవిరైపోయింది. బీఎస్ఈ నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ. 7,52,520.34 కోట్లు తరిగిపోయి రూ.4,24,07, 205.81 కోట్లు లేదా 4.90 ట్రిలియన్ డాలర్లకు పరిమితమైంది. బీఎస్ఈలో మొత్తం 4,088 షేర్లు ట్రేడ్ అవగా, 2,881 షేర్లు నష్టపోయాయి. మిడ్ క్యాప్ 2 శాతం, స్మాల్ క్యాప్ 1.94 శాతం చొప్పున నిరాశపర్చాయి.

నష్టాలకు ప్రధాన కారణాలు

- అమ్మకాల ఒత్తిడిలో మదుపరులు
- వాణిజ్య యుద్ధం దిశగా ట్రంప్ అడుగులు
- అంతర్జాతీయ మార్కెట్‌లో అనిశ్చిత వాతావరణం
- భారత్ నుంచి తరలిపోతున్న విదేశీ సంస్థాగత పెట్టుబడులు
- డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ పతనం

ఐపీవో షేర్లలో ప్రీ-లిస్టింగ్ ట్రేడింగ్!

పరిచయం చేసే యోచనలో సెబీ • గ్రే మార్కెట్ కార్యకలాపాలకు చెక్ పెట్టడానికే

ముంబై, జనవరి 21: గ్రే మార్కెట్ కార్యకలాపాల నిరోధానికి ఐపీవో షేర్లలో ప్రీ-లిస్టింగ్ ట్రేడింగ్‌ను పరిచయం చేసే యోచనలో మార్కెట్ రెగ్యులేటర్ సెబీ ఉన్నది. ఇనీషియల్ పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీవో)లో కేటాయించిన షేర్లను ఇన్వెస్టర్లు వెంటనే అమ్ముకునేలా ఓ వ్యవస్థను తీసుకురావాలనుకుంటున్నట్టు సెబీ చైర్‌పర్సన్ మదాబీ పురీ బచ్ మంగళవారం ఇక్కడ తెలిపారు. తద్వారా గ్రే మార్కెట్ కార్యకలాపాలకు చెక్ పెట్టాలని చూస్తున్నట్టు చెప్పారు. రెండు అగ్రశ్రేణి ప్రాక్సీ అడ్వైజరీ సంస్థలు ఈ పనిలోనే నిమగ్నమయ్యాయని, త్వరలోనే ఓ పోర్టల్ ప్రారంభం కావచ్చన్నారు. సదరు లావాదేవీలన్నీ ఇందులో నిక్షిప్తమవుతాయని, కంపెనీల్లో పాలనాపరమైన ప్రమాణాలను నిర్వహించడంలోనూ ఇది దోహదపడగలదన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

సెబీ ఏం చేస్తున్నదంటే..

ఇటీవలికాలంలో దేశీయ స్టాక్ మార్కెట్లలోకి పెద్ద ఎత్తున ఐపీవోలు వస్తున్న విషయం తెలిసిందే. అలాగే లిస్టింగ్ రోజున భారీ లాభాలనూ నమోదు చేస్తున్న సంగతీ విదితమే. కానీ దీనికి కారణం గ్రే మార్కెట్ కార్యకలాపాలేనని సెబీ అంటున్నది. ఐపీవో ముగిసిన దగ్గర్నుంచి షేర్లు స్టాక్ మార్కెట్లలో నమోదు కావడానికి మధ్య ప్రస్తుతం 3 రోజుల విరామం ఉంటున్నది. ఈ సమయంలో ఇన్వెస్టర్లు, ఆథరైజ్డ్ కాని డీలర్ల నడుమ అనధికార, నియంత్రణలేని క్రయవిక్రయాలు ఎక్కువగా జరుగుతున్నాయి. వీటినే గ్రే మార్కెట్ కార్యకలాపాలుగా పేర్కొంటున్నారు. అందుకే అనధికారికంగా జరుగుతున్న ఈ లావాదేవీలకు.. మదుపరులు కోరుకుంటే సక్రమ రీతిలో ఎందుకు జరుగడానికి అవకాశం ఇవ్వొద్దని ఆలోచించామని బచ్ చెప్తున్నారు. ఐపీవోలో షేర్ల కేటాయింపు జరిగిందంటే అది లీగలేనని, వాటిని అమ్ముకునే హక్కు కొన్నవారికి ఉంటుందని చెప్పారు. అందులో భాగంగానే ఐపీవో షేర్లలో ప్రీ-లిస్టింగ్ ట్రేడింగ్‌కు అనుమతిచ్చే దిశగా వెళ్తున్నట్టు తెలిపారు.

బ్రాండ్లలో మేటి.. భారతీయ ఐటీ

అత్యంత విలువైన సంస్థల్లో టీసీఎస్, ఇన్ఫీ, హెచ్‌సీఎల్

బ్రాండ్ ఫైనాన్స్ తాజా నివేదికలో వెల్లడి



న్యూఢిల్లీ, జనవరి 21: దేశీయ ఐటీ దిగ్గజాలు అంతర్జాతీయ స్థాయిలో మరోసారి సత్తాచాటాయి. ప్రపంచవ్యాప్తంగా అత్యంత విలువైన సంస్థల జాబితాలో ఐదు సంస్థలు చోటు దక్కించుకున్నాయి. వీటిలో టీసీఎస్, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, విప్రో, టెక్ మహీంద్రాలు ఉన్నాయని బ్రాండ్ ఫైనాన్స్ తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. అంతర్జాతీయంగా టాప్-10 విలువైన సంస్థల్లో అమెరికా ఎప్పటిలాగే 40 శాతంతో తొలిస్థానంలో నిలిచింది. 36 శాతం వాటాతో భారత్ ఆ తర్వాతి స్థానంలో నిలిచినట్లు వెల్లడించింది. యూఎస్ టెక్నాలజీ దిగ్గజం యాక్సెంచర్ వరుసగా ఏడోసారి అత్యంత విలువైన సంస్థగా తన స్థానాన్ని కొనసాగించింది. దేశీయ ఐటీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ 21.3 బిలియన్ డాలర్ల బ్రాండ్ విలువ(11 శాతం ఎగబాకింది)తో రెండో స్థానం దక్కించుకున్నది. వరుసగా నాలుగోసారి ఈ స్థానాన్ని దక్కించుకోవడం విశేషం. మరోవైపు, 2025లో అత్యంతవేగవంతమైన ఐటీ సర్వీసుల బ్రాండ్‌గా హెచ్‌సీఎల్ టెక్నాలజీ అవతరించిందని పేర్కొంది. గడిచిన ఐదేండ్లుగా తొలిస్థానంలో ఉన్న ఇన్ఫోసిస్‌ను వెనక్కినెట్టి హెచ్‌సీఎల్ ఈ స్థానాన్ని దక్కించుకున్నదని బ్రాండ్ ఫైనాన్స్ విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. మొత్తం ఐటీ విలువల్లో 36 శాతం వాటాతో భారత్ రెండోస్థానంలో కొనసాగుతున్నది. గత కొన్నేండ్లుగా నిరాశాజనక పనితీరు కనబరిచిన అమెరికా మార్కెట్ తిరిగి పుంజుకోవడం దేశీయ ఐటీ సంస్థలకు కలిసొచ్చిందని, ముఖ్యంగా నూతన ఆర్డర్లు రావడంతో దేశీయ ఐటీ సంస్థలు కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొంది. మూడోస్థానంలో నిలిచిన ఇన్ఫోసిస్ బ్రాండ్ విలువ 15 శాతం ఎగబాకి 16.3 బిలియన్ డాలర్లకు చేరుకున్నది. ఇదే స్థానంలో కొనసాగడం వరుసగా నాలుగోసారి. ఇన్ఫోసిస్ సీఈవో పరేఖ్ నాయకత్వంలో సంస్థ అన్ని విభాగాల్లో రాణిస్తున్నదని, పనితీరు మెరుగుపడటంతోపాటు ఇన్నోవేషన్‌లో దూసుకుపోతున్నదని పేర్కొంది. అలాగే హెచ్‌సీఎల్ టెక్నాలజీ బ్రాండ్ విలువ 17 శాతం ఎగబాకి 8.9 బిలియన్ డాలర్లకు చేరుకోగా, విప్రో విలువ 6 బిలియన్ డాలర్లు కాగా, టెక్ మహీంద్రా కూడా టాప్-10లో చోటు దక్కించుకున్నాయి. అలాగే టాప్-25 గ్లోబల్ ర్యాకింగ్ సంస్థల్లో తొలిసారిగా హెక్సావేర్ టెక్నాలజీ ప్రవేశించింది.

హెచ్‌సీఎల్ టెక్ విస్తరణ

హైదరాబాద్, జనవరి 21: హెచ్‌సీఎల్ టెక్నాలజీ..హైదరాబాద్‌లో నూతన సెంటర్‌ను ప్రారంభించింది. అంతర్జాతీయ క్లయింట్లకు కృత్రిమ మేధస్సు, డిజిటల్ ట్రాన్స్‌మిషన్ సొల్యూషన్స్ సేవలు అందించాలనే ఉద్దేశంతో నగరంలో కొత్తగా సెంటర్‌ను ఆరంభించినట్లు కంపెనీ సీఈవో, ఎండీ సీ విజయకుమార్ తెలిపారు. హై-టెక్ సిటీలో 3.20 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ సెంటర్‌లో 5 వేల మంది కూర్చోవడానికి వీలుంటుందన్నారు.

విప్రో కన్స్యూమర్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్

హైదరాబాద్, జనవరి 21: విప్రో అనుబంధ సంస్థయైన విప్రో కన్స్యూమర్ కేర్ అండ్ లైటింగ్ సంస్థ..హైదరాబాద్‌లో ఐవోటీ ఆధారిత ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను ప్రారంభించింది. రాష్ట్రంలో అత్యాధునిక లైటింగ్‌కు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని ఈ సెంటర్‌ను నెలకొల్పినట్లు, దేశంలో ఇది రెండో సెంటర్‌ని కంపెనీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్, బిజినెస్ హెడ్ అనూజ్ ధీర్ తెలిపారు.

దవాఖానలో చికిత్స పొందుతున్న రిత్విక్

అమ్మలేకుండా ఉండలేనని..

• గుంటపల్లి చెరువు తండాలో బాలుడి ఆత్మహత్యాయత్నం • దవాఖానలో చికిత్స

ఎల్లారెడ్డిపేట, జనవరి 21: రాత్రి పడుకున్నప్పుడు పక్కనున్న తల్లి తెల్లవారే సరికి కనిపించకపోవడంతో ఆ పిల్లలు కంగారు పడ్డారు. మీ అమ్మ దవాఖానలో చేరిందని, సీరియస్‌గా ఉందని తోటి పిల్లలు ఆటపట్టించడం మనస్తాపం చెందారు. తల్లిలేకుండా తాము బతకలేమని ఓ బాలుడు ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన గుంటపల్లి చెరువు తండాలో మంగళవారం జరిగింది. స్థానికులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటపల్లి చెరువు తండాకు చెందిన భూక్యా సంతోష్-స్వర్ణలత దంపతులకు రిత్విక్(8), రిష్విత్(7) ఇద్దరు కొడుకులు. సోమవారం రాత్రి సంతోష్ తండ్రి రూప్‌సింగ్, తమ్ముడు సురేశ్ గొడవపడగా ఇద్దరికి గాయాలయ్యాయి. మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ దవాఖాకు తరలించారు. వారితో సంతోష్-స్వర్ణలత దంపతులిద్దరూ వెళ్లారు. అదే రాత్రి సంతోష్ తిరిగి ఇంటికి చేరుకున్నాడు. స్వర్ణలత అక్కడే ఉండిపోయింది. అయితే గ్రామంలో పారిశుధ్య కార్మికుడిగా పని చేస్తున్న సంతోష్, గ్రామ సభ ఉండడంతో ఉదయమే వెళ్లిపోయాడు. రిత్విక్, రిష్విత్ నిద్ర లేచే సరికి తల్లిదండ్రులు కనిపించక పోవడంతో గాబరా పడ్డారు. స్థానిక చిన్నారులు వచ్చి 'మీ అమ్మకు ఆరోగ్యం బాగలేక రాత్రి దవాఖానకు తీసుకెళ్లారని, ఆమె సీరియస్‌గా ఉందని ఆటపట్టేందుకు చెప్పగా, చిన్నారులిద్దరూ ఆందోళన చెందాడు. అమ్మ లేకుండా ఉండలేమని చనిపోదామని రిత్విక్ తమ్ముడితో చెప్పాడు. గుడిసెలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యాయత్నం చేశాడు. రిష్విత్ ఏడ్చుకుంటూ బయటకు వచ్చి అరిచేసరికి స్థానికులు వచ్చి రిత్విక్‌ను మండల కేంద్రంలోని దవాఖానకు తరలించారు. కాగా, బాలుడి ఉరి ఘటనపై గ్రామస్తులు పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

తాగునీటి గోసలు తీర్చండి

• ముస్తాబాద్ మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో మహిళల ఆందోళన

ముస్తాబాద్, జనవరి 21: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో పది రోజుల నుంచి తాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మంగళవారం కాలనీ మహిళలు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు వారు మాట్లాడుతూ, ఎస్సీ కాలనీలో తాగునీరు అందించడానికి రెండు బోరు బావులు ఉన్నాయని తెలిపారు. ఓ బోరు బావిని దాదాపు ఏడాది నుంచి మరమ్మతులు చేయలేక అధికారుల నిర్లక్ష్యం కారణంగా నీటి సమస్య ఏర్పడిందన్నారు. ఉన్న ఒక్క బోరు బావి పది రోజుల క్రితం కాలిపోవడంతో ఎస్సీ కాలనీలో తాగునీటికి తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నామన్నారు. గ్రామపంచాయతీ అధికారులకు చెప్పిన పట్టించుకోకపోవడలేదన్నారు. కాలనీలో నీటి సమస్య తీవ్రంగా ఉందని అధికారులు వెంటనే స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు వేడుకుంటున్నారు. ఇక్కడ గొట్టె వెంకటరాజం, రాజు, జంగం జనవ్వ, సౌందర్య, లావణ్య, కట్కూరి బాలవ్వ, లక్ష్మి, నర్సవ్వ, హారిక, యాదమ్మ, తలారి వసంత ఉన్నారు.

మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో ఆందోళన చేస్తున్న మహిళలు

మహా సభను విజయవంతం చేయాలి

కోనరావుపేట, జనవరి 21: మండలంలోని మరిమడ్ల గ్రామంలో ఈనెల 24న నిర్వహించే లక్ష డప్పులు, వేల గొంతుల మహాసభను విజయవంతం చేయాలని గ్రామ అధ్యక్షుడు మల్యాల మనోజ్‌మాదిగ పిలుపునిచ్చారు. మంగళవారం నిమ్మపల్లి గ్రామంలో సభకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎస్సీ వర్గీకరణ ధ్యేయంగా పార్టీలకు అతీతంగా ఈ సభను నిర్వహించడం జరుగుతుందని మాదిగ జాతి సోదరులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమానికి మాదిగ మందకృష్ణ ముఖ్యఅతిథిగా వస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాక్షుడు మల్యాల వంశీ, గొర్రె సుధాకర్, స్వామి, కార్తీక్, శేఖర్, వేణు, దీపక్, దినకార్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

వేములవాడ రూరల్: చెక్కపల్లి ప్రభుత్వపాఠశాలలో మాట్లాడుతూన్న సీఐ శ్రీనివాస్

తెలంగాణ చౌక్, జనవరి 21: ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు నివారించవచ్చని టౌన్ సీఐ కృష్ణ పేర్కొన్నారు. ఈ మేరకు పట్టణంలోని విజ్ఞాన వర్ధిని పాఠశాలలో నిర్వహించిన రోడ్డు భద్రత మాస ఉత్సవాలు, నెహ్రూనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పోలీస్ అక్క కార్యక్రమాలకు హాజరై, మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే సైబర్ నేరాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు.

వేములవాడ రూరల్, జనవరి 21: ట్రాఫిక్ రూల్స్‌ను పాటించి వాహనాలను నడపాలని వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం వేములవాడ రూరల్ మండలం చెక్కపల్లి జడ్పీహెచ్ పాఠశాలలో రోడ్డు భద్రత మాసోత్సవాల పై అవగాహన కల్పించారు. ఇక్కడ ఎస్ఐ మారుతి, ఎంఈవో కిషన్, విద్యార్థులు ఉన్నారు.

వేములవాడ టౌన్, జనవరి 21: పట్టణంలోని కృష్ణవేణి గ్రూప్ ఆఫ్ స్కూల్స్‌లో ట్రాఫిక్ పై మంగళవారం అవగాహన సదస్సును పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ సీఐ వీరప్రసాద్ మాట్లాడుతూ, విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని, ట్రాఫిక్ రూల్స్ తెలిసుండేలా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇక్కడ ట్రాఫిక్ ఎస్ఐ రాజు, స్కూల్ కరస్పాండెంట్ సన్నిధి వెంకటకృష్ణ ఉన్నారు.

ఇల్లంతకుంట, జనవరి 21: ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని ఎస్ఐ కదిరె శ్రీకాంత్‌గౌడ్ సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మంగళవారం రోడ్డు భద్రతా వారోత్సవాలపై అవగాహన కల్పించారు. ఇక్కడ ప్రిన్సిపాల్ దేవరాజం, కళాశాల, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ఎల్లారెడ్డిపేట, జనవరి 21: మండల కేంద్రంలోని విజ్ఞాన్ ఇంగ్లిష్ మీడియం, దుమాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై ఎస్ఐ రమాకాంత్ అవగాహన కల్పించారు.

కోనరావుపేట, జనవరి 1: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రోడ్డు భద్రత వారోత్సవాలలో భాగంగా రోడ్డు నియమ నిబంధనలపై విద్యార్థులకు ఎస్ఐ ప్రశాంత్‌రెడ్డి అవగాహన కల్పించారు. ఇక్కడ ఎస్ఐ రాహుల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ కేదారేశ్వర్, తదితరులు ఉన్నారు.

ఆటో యూనియన్ ఎన్నిక

ఎల్లారెడ్డిపేట, జనవరి 21: మండల ఆటో యూనియన్ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బోగ శ్రీని వాస్, ఉపాధ్యక్షుడిగా రేండ్ల దేవయ్య, కోశాధికారిగా దేవదానం, రైటర్‌గా పరశురాములు, గౌరవాధ్యక్షుడిగా బాలయ్య ఎన్నికయ్యారు.

క్రీడా దుస్తులు అందజేత

కోనరావుపేట, జనవరి 21: నిజామాబాద్ గ్రామానికి చెందిన మంకు అరుణ్‌కుమార్‌జ్ఞాపకార్థం అతడి స్నేహితుడు తాళ్లపల్లి శ్రీకాంత్‌గౌడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు 12జతల టీషర్టులను మంగళవారం అందజేశాడు. శ్రీకాంత్‌గౌడ్‌ను హెచ్ఎం షాబుద్దీన్, వ్యాయామ టీచర్ అజయ్‌కుమార్ అభినందించారు. ఇక్కడ యువకులు తాళ్లపల్లి మధు, చేకూట రమేశ్, శ్రీరాముల ప్రశాంత్, వెలిశాల తిరుపతి, సింగం ధనుశ్, తదితరులు ఉన్నారు.

గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన

కోనరావుపేట, జనవరి 21: మండల కేంద్రంలోని వాసవి విద్యాలయంలో పోలీస్ అక్క కార్యక్రమాన్ని మహిళ కానిస్టేబుల్ సంధ్య నిర్వహించారు. చిన్నారులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. ఇక్కడ హెచ్ఎం, తదితరులు ఉన్నారు.

రుద్రంగి, జనవరి 21: మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో ఎఎస్ఐ కన్నిరాం ఆధ్వర్యంలో విద్యార్థులకు పోలీస్ అక్క అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ పై అవగాహన కల్పించారు. 100 డయిల్ ప్రాధాన్యతను వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో డయిల్ 100కి కాల్ చేయాలన్నారు. ఎవరైనా ఆకతాయిలు వేధిస్తే షీ టీం కు కాల్ చేయాలన్నారు.

వృద్ధురాలి పై వానరాల దాడి

సిరిసిల్ల రూరల్, జనవరి 21: తంగళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన పయ్యావుల మల్లవ్వ(90) పై మంగళవారం వానరాలు దాడి చేయగా తీవ్రంగా గాయపడింది. వృద్ధురాలు ఇంట్లో ఉండగా ఇంట్లో చొరబడి వానరాలు మూకుమ్మడిగా దాడి చేయడంతో తీవ్రంగా గాయపడింది. కోతుల నుంచి కాపాడాలని గ్రామస్తులు అధికారులను కోరారు.

మహాసభలు విజయవంతం చేయాలి

వేములవాడ, జనవరి 21: సీపీఎం రాష్ట్ర 4వ సభలను విజయవంతం చేయాలని జిల్లా కమిటీ సభ్యులు ముక్తికాంత అశోక్, మల్లారపు ప్రశాంత్ కోరారు. మంగళవారం పట్టణంలో పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. మహాసభలు సంగారెడ్డిలో ఈ నెల 25 నుంచి 28వ తేదీ వరకు జరగనున్నాయని తెలిపారు. ఈ మహాసభలలో మూడేళ్లుగా ప్రజల కోసం చేసిన పోరాటాలు, సాధించిన విజయాలను చర్చించుతారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తి చేయడంలో విఫలమైందన్నారు. ఏడో గ్యారెంటీగా ఇచ్చిన హామీ స్వేచ్ఛ స్వాతంత్రం, ప్రజాస్వామ్యం అమలులో బాధ్యతారహితంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. పొలిట్ బ్యూరో సభ్యులు బృందా కారత్, బీవీ రాఘవులు, విజయ రాఘవన్, రాష్ట్ర కార్యదర్శి వీరభద్రం తదితరులు హాజరవుతారని చెప్పారు.

WATCH & ENJOY RELOADED VERSION IN THEATRES

మల్టిప్లెక్స్ టికెట్ ధర : ~~295~~/- 150/-, ~~350~~/- 200/-

సింగిల్ స్క్రీన్స్ టికెట్ ధర : 112/-, 90/-, 55/-,

సంధ్య 70 ఎ/సి - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్ 10.00,2.00,6.00,10.00

ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND

MYTHRI THEATRES సిమాల్ 70 - బాలానగర్ 8.00AM 64 Channel Dolby Atmos 4k Laser Projection Centrally Air Conditioned

MYTHRI రాజధాని 70- దిల్‌సుఖ్‌నగర్ 10.30,2.30,6.30,10.30

PVR సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట
PVR ఇన్‌ఆర్బిట్‌మాల్ - మాదాపూర్
PVR నెక్టస్ మాల్ - కూకట్‌ప